సాక్షి చిత్తూరు

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025




కిక్కిరిసిన బోయకొండ

బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఉపవాస దీక్షలతో మహిళలు పూజలు చేశారు. - 8లో



కుంకీ ఏనుగులతో సమస్య పరిష్కారం

50 ఎకరాల్లో ఏర్పాటు చేస్తున్న కుంకీ ఎలిఫెంట్ క్యాంపును ఫారెస్ట్ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ పరిశీలించారు. - 8లో



పట్టుబడ్డ ఎర్రచందనం?

దిగువ కంద్రిగలో శనివారం రాత్రి ఎర్రచందనం దుంగలు పోలీసులకు పట్టుబడటం కలకలం రేపింది. - 8లో

న్యూస్‌రీల్

నేడు కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక

చిత్తూరు కలెక్టరేట్ : ప్రజల సమస్యల పరిష్కారం కోసం సోమవారం కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు ప్రజాసమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ సమావేశానికి అన్ని శాఖల జిల్లా అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. గైర్హాజరయ్యే వారిపై శాఖాపరంగా చర్యలుంటాయని కలెక్టర్ హెచ్చరించారు.

16న గణపతి వ్రతం

కాణిపాకం : ఈనెల 16న సంకటహర గణపతి వ్రతంను నిర్వహిస్తున్నట్లు కాణిపాక శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థాన ఆస్థాన మండపంలో ఈ వ్రత ఏర్పాట్లు ఉంటాయన్నారు. ఉదయం 10 నుంచి 11 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 6 గంటల వరకు వ్రతం నిర్వహిస్తారన్నారు. అలాగే రాత్రి 7 గంటల నుంచి 8 గంటల వరకు స్వర్ణ రథోత్సవం జరుగుతుందన్నారు. వ్రత సేవల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న భక్తులు ఆన్‌లైన్ ద్వారా టికెట్లు పొందవచ్చునని పేర్కొన్నారు.

నేడు 'పరీక్షా పే చర్చా'

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రభు త్వ పాఠశాలల్లో సోమవారం పరీక్షా పే చర్చ కార్యక్రమం వీక్షించాలని డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు. ఈ మేరకు ఆదివారం ఆమె విలేకరులతో మాట్లాడారు. రాష్ట్ర విద్యాశాఖ అధికారుల ఆదేశాల మేరకు సోమవారం జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పరీక్షా పే చర్చ కార్యక్రమం వీక్షించాలన్నారు. ఉదయం 11 గంటలకు నిర్వహించే ఈ కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ విద్యార్థులతో సంభాషిస్తారన్నారు. జిల్లాలోని డీవైఈవో, ఎంఈవోలు కార్యక్రమం పకడ్బందీగా నిర్వహించేలా పర్యవేక్షించాలన్నారు.



వరలక్ష్మి, డీఈఓ

పోలీసు గ్రీవెన్స్‌ను సద్వినియోగం చేసుకోండి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలోని వన్ టౌన్ పక్కన ఉన్న ఆర్ముడు రిజర్వు (ఏఆర్) కార్యాలయంలో సోమవారం ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక (గ్రీవెన్స్‌డే) కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎస్పీ మణికంఠ చందోలు ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు వారి సమస్యలు ఏవైనా ఉంటే తనను నేరుగా కలిసి మాట్లాడొచ్చన్నారు. ఇక్కడ ఇచ్చే వినతులు, ఫిర్యాదులను పరిశీలించి చర్యలు చేపడుతామని ఎస్పీ తెలిపారు.

నేటి నుంచి జాతీయ సదస్సు

తిరుపతి సిటీ: పద్మావతి మహిళా వర్సిటీలో ఎమ్ఎస్ఎమ్ఈ సహకారంతో ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు సోమవారం నుంచి ఈనెల 14వ తేదీ వరకు ఐదు రోజుల పాటు జాతీయ సదస్సు నిర్వహించన్నారు. అడ్వాన్స్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం 2024–25 సంబంధించి 'పేటెంట్ అప్లికేషన్ డ్రాఫ్టింగ్ అండ్ ఫైలింగ్ ప్రొసీజర్స్ ఇన్ ఇండియా అనే అంశంపై జాతీయ సదుస్సు జరగనుంది.

ఎక్కడైతే స్త్రీలు పూజింపబడతారో అక్కడ దేవతలు సంచరిస్తుంటారు. ఆధునిక సమాజంలో ఆడవారికి ఆకాశంలో సగం అంటూ అగ్రపీఠం వేశారు. అయితే కొందరు మాత్రం మహిళలను ఆటబొమ్మలుగానే చూస్తున్నారు. వంటింటి కుందేళ్లుగానే భావిస్తున్నారు. మళ్లీ ఆటవిక యుగంలోకే నెట్టేస్తున్నారు. ఇదే కోవలో జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ వ్యవహరిస్తున్నారు. మహిళల రక్షణ అంటూ వారి పార్టీ అధినేత గొంతు చించుకుంటూ ఉంటే.. అనుయాయుడు మాత్రం అతివల జీవితాలతో ఆడుకుంటున్నారు. 'చిల్లర' వేషాలు వేస్తూ సాఫీగా సాగుతున్న సంసారాలను విచ్ఛిన్నం చేస్తున్నారు. గుట్టుగా కాపురం చేసుకుంటున్న వనితలను కల్లబొల్లి కబుర్లతో లోబరుచుకుని రూ.కోట్లు కాజేస్తున్నారు. ప్రశ్నించిన వారిని చంపేస్తానంటూ బెదిరింపులకు గురిచేస్తున్నారు. బ్లాక్ టికెట్ విక్రయాలతో బతుకు మొదలుపెట్టిన సదరు కిరణ్‌వారు.. బ్లాక్‌మెయిలింగ్ రాజకీయాలతో స్వప్రకటిత నేతగా హల్‌చల్ చేస్తున్నారు. మెగా ఫ్యామిలీకి సన్నిహితుడని చెప్పుకుంటూ యథేచ్ఛగా అక్రమాలకు పాల్పడుతున్నారు.

కిలాడీ కిరణ్

మురిపాల కిరణ్





చిల్లర వేషాలు!

- బ్లాక్ టికెట్ విక్రయాలతో మొదలైన జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్ రాయల్ జీవితం
- బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతూ రాజకీయం
- డబ్బుల కోసం విచ్చలవిడిగా వివాహేతర సంబంధాలు
- మెగా ఫ్యాన్ ముసుగులో యథేచ్ఛగా అక్రమాలు
- కామాంధుడిని కఠినంగా శిక్షించాలంటున్న మహిళా సంఘాలు

సాక్షి ప్రతినిధి, తిరుపతి : ''జనసేన తిరుపతి ఇన్‌చార్జి కిరణ్‌రాయల్ నా జీవితం నాశనం చేశాడు. రూ.1.20 కోట్లు తీసుకుని మోసం చేశాడు. నన్ను అప్పుల పాలు చేసేశాడు. అడిగితే మమల్ని చంపేస్తానంటూ బెదిరిస్తున్నాడు'' అంటూ ఓ మహిళ విడుదల చేసిన ఆడియో.. వీడియోలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి. జనసేనలో సదరు కిరణ్‌రాయల్ కీలకంగా వ్యవహరిస్తుండడంతో ఆ పార్టీకి తలనొప్పిగా మారాయి. దీనిపై పవన్‌కల్యాణ్ సైతం సీరియస్ అయినట్లు సమాచారం. కిరణ్ రాయల్‌పై చర్యలకు దిగినట్లు తెలుస్తోంది.

ఎవరీ కిరణ్?



కిరణ్ రాయల్ జీవితం అంతా వివాదాస్పదంగానే ఉంది. సుమారు 25 ఏళ్ల క్రితం తిరుపతికి వలస వచ్చిన కిరణ్ తన బతుకును గ్రూప్ థియేటర్స్ నుంచి ప్రారంభించాడు. చిరంజీవి సినిమాలకు బ్లాక్‌లో టికెట్లు విక్రయిస్తూ ఆపై మెగా స్టార్ ఫ్యాన్స్ అసోసియేషన్ నేతగా ఎదిగాడు. ఆ క్రమంలో ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు రైల్వేస్టేషన్ ఎదురుగా ఓ హోటల్ యజమానిని ఒప్పించి క్లబ్ కొట్టు ఏర్పాటు చేసుకున్నాడు. అప్పటి వరకు అతను కిరణ్‌గానే అందరికీ పరిచయం. క్లబ్ కొట్టులో మాదకద్రవ్యాలను సైతం విక్రయించే ఈ స్థాయికి ఎదిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. మెగా ఫ్యాన్‌గా చిన్నపాటి కార్యక్రమాలు చేపడుతూ చిరంజీవి దృష్టిలో పడ్డాడు. మెగా ఫ్యాన్స్‌కు జిల్లా అధ్యక్షుడిగా, రాష్ట్ర పదవిలోనూ కొనసాగాడు. ఈ క్రమంలో తిరుపతి నగరంలో బలిజ సామాజిక వర్గానికి చెందిన మహిళను పెళ్లి చేసుకున్నాడు. తదనంతరం కిరణ్ ''రాయల్''గా అవతరించాడు. ఇంతలో చిరంజీవి ప్రజారాజ్యం పార్టీ స్థాపించడంతో ఆయనకు రాజకీయ ప్రాధాన్యం లభించింది. ఆపై పవన్‌కల్యాణ్‌కు దగ్గరవుతూ జనసేనలోనూ కొనసాగాడు. తిరుపతిలో ఆ పార్టీలో చేరేందుకు ముఖ్యనేతలెవ్వరూ మొగ్గు చూపకపోవడంతో కిరణ్ రాయలే పెద్ద దిక్కుగా మారాడు.

ఒక్కొక్కటి వెలుగులోకి..

కిరణ్ కుమార్ అలియాస్ కిరణ్ రాయల్ రాసలీలలు ఒక్కొక్కటే వెలుగులోకి వస్తున్నాయి. నమ్మించి మోసం చేసిన కిరణ్ రాసలీలల భాగోతాన్ని బాధిత మహిళ బట్టబయలు చేసింది. మరో వివాహితతో సైతం కిరణ్ శారీరక సంబంధం కొనసాగిస్తున్నట్లు ఆధారాలతో వెల్లడించింది. ఈ క్రమంలోనే జనసేన పార్టీలోని ఇద్దరు మహిళలతో అసభ్యంగా ప్రవర్తించడంతో పాటు పార్టీ పదవులను పావులుగా చూపి లోబరుచుకున్నట్లు నగరంలో సైతం చర్చ జరుగుతోంది. కామాంధుడిని అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించాలని బాధితులతో పాటు మహిళా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. తనలా కిరణ్ బాధితులు ఎవరైనా ఉంటే ధైర్యంగా ముందుకురావాలని, మహిళలను మోసగించే దుర్మార్గుడికి శిక్షపడేందుకు ఆధారాలు ఇవ్వాలని లక్ష్మి కోరుతున్నారు.

దర్శన టికెట్లలో అవినీతి

తిరుపతి ఎమ్మెల్యేగా చిరంజీవి గెలుపొందిన రోజులల్లో కిరణ్ అక్రమాల భాగోతం తిరుమలకు పాకింది. తన అభిమాని కావడం, పార్టీ వ్యవహారాలు చూస్తుండడంతో శ్రీవారి దర్శన సిఫార్సు లేఖల వ్యవహారం మొత్తం కిరణ్‌కు అప్పగించారు. ఈ క్రమంలోనే సిఫార్సు లేఖలను కిరణ్‌రాయల్ అక్రమంగా రూ.లక్షలకు విక్రయించి సొమ్ము చేసుకున్నాడు. ఈ విషయం చిరంజీవి చెవిన పడడంతో ఆయన పలు మార్లు కిరణ్‌ని తీవ్రంగా మందలించిన విషయం తెలిసిందే. దీంతో కొంత కాలం పాటు కిరణ్‌ను పక్కన పెట్టారు. నాగబాబు ద్వారా మంతనాలు నడిపి మళ్లీ మెగా కుటుంబం పంచన చేరాడు. తిరుమలలో శ్రీవారి దర్శన టికెట్ల వ్యవహారంలో ఆయనపై పలు కేసులు నమోదవడం గమనార్హం.

'గో బ్యాక్ ఆరణి అంటూ'..

జనసేన పార్టీ తిరుపతి అభ్యర్థిగా ఆరణి శ్రీనివాసులు పేరును ఖరారు చేయడంతో కిరణ్ రాయల్ తీవ్రంగా వ్యతిరేకించారు. ముందు ఆరణితో సఖ్యతగా ఉన్నా తనకు లొంగలేదన్న అక్కసుతో తిరుపతి నగరం అంతా 'గోబ్యాక్ ఆరణి' అంటూ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించాడు. ఎన్నికల సమయంలో ఈ ఫ్లెక్సీల అంశం రాజకీయంగా కుదిపేసింది. జనసేనలోనే ఉంటూ ఆ పార్టీకి నష్టం చేకూర్చేలా వ్యవహరించడం ముఖ్యనేతలకు నచ్చలేదు. మెగా ఫ్యాన్ అసోసియేషన్ నేత కావడంతో మందలించి వదిలేశారు. ఎన్నికలలో ఆరణికి వ్యతిరేకంగా పనిచేశాడని ఆధారాలతో సహా పవన్‌కల్యాణ్‌కు ఫిర్యాదు చేశారు. ఈ క్రమంలోనే మొన్నటి వరకు ఎమ్మెల్యేతో ఉప్పు నిప్పుగా ఉంటూ వచ్చాడు. మళ్లీ కొద్దిరోజులుగా ఎమ్మెల్యే ఇంటి వైపునకు వెళ్లివస్తున్నాడు. ఇంతలో ఈ వ్యవహారం వెలుగులోకి రావడం ఆ పార్టీలో సంచలనంగా మారింది. అలాగే గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నత అధికారులను టార్గెట్ చేసుకుని బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడ్డాడు. అసభ్యంగా దూషిస్తూ తీవ్రమైన విమర్శలు మూటగట్టుకున్నాడు. ఈ క్రమంలోనే అప్పటి టీటీడీ ఈఓ, కలెక్టర్, కార్పొరేషన్ కమిషనర్‌ను సైతం బ్లాక్‌మెయిల్ చేసినట్టు ఆరోపణలు ఉన్నాయి.

మాయమాటలతో మహిళలకు వల!



సరసాల కిరణ్

తనకున్న మాటకారితనం, హావభావాలతో మహిళలను ఆకట్టుకునేవాడు. తనకు పెళ్లై ఇద్దరు పిల్లలు ఉన్నా ఇతర మహిళలను వలలో వేసుకోవడం పరిపాటిగా మార్చుకున్నాడు. అందులో భాగంగా తన పక్కింటిలో ఉన్న లక్ష్మీరెడ్డి కుటుంబంతో చనువు పెంచుకున్నాడు. మాయ మాటలు చెప్పి ఆమెను బుట్టలో వేసుకున్నాడు. చివరకు ఆ కుటుంబం విడిపోవడానికి కారకుడయ్యాడు. అతడి మోజులో పడిన ఆ మహిళ కుటుంబాన్ని వదలి కిరణ్ వెంట నడిచింది. రాజకీయంగా ఎదుగుతున్న తనకు ఆర్థిక అండ అవసరమని గుర్తించి ఆమెకున్న ఎకరం భూమిని అమ్మించి సొమ్ము చేసుకున్నాడు. పలు దఫాలుగా రూ.1.32కోట్ల నగదును చేయి బదులుగా తీసుకున్నట్లు ఆ మహిళ ఆధారాలను బయటపెట్టింది. దీంతో పాటు 300గ్రాముల బంగారు నగలను కాజేశాడని వెల్లడించింది. ఆమెతో వివాహేతర సంబంధం నడుపుతూనే మరో మహిళను ముగ్గులోకి దింపాడు. కొన్నాళ్లకు ఈ వ్యవహారం బట్టబయలు కావడంతో ఇద్దరి మహిళల మధ్య చిచ్చురేగింది. దీనిపై నిలదీయడంతో లక్ష్మీని దూరం పెడుతూ వచ్చాడు. నిన్ను నమ్ముకుని సర్వస్వం నీకే ఇచ్చేశాను.. నీ కారణంగా నా కుటుంబం రోడ్డున పడింది. నా బిడ్డలు అనాథలయ్యారని లక్ష్మి వేడుకున్నా కఠిన మనస్తత్వం కరగలేదు. దీంతో ఆమె తనకు ఇవ్వాల్సిన నగదు బంగారం తిరిగి ఇవ్వాలని కిరణ్‌ను అడగడంతో వివాదం పెద్దదైంది. ఈ క్రమంలోనే ఆ మహిళ పట్ల దారుణంగా వ్యవహరించి, పత్రికలో రాయలేని విధంగా దుర్భాషలాడుతూ చంపేస్తానంటూ బెదిరించాడు. ఆమెపై నేరుగా దాడి చేసినట్లు వాయిస్ రికార్డులో కిరణ్ ఒప్పుకున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. నిన్ను చంపి బెయిల్‌పై తిరిగొస్తా.... నిన్ను ఎవడు కాపాడుతాడో చూస్తా... నీలాంటి వాళ్లను చాల మందిని చూశా... నా వెంట్రుక కూడా ఏవరూ పీకలేరు...నీవల్ల ఏమవుతుందో అది చేసుకో...అంటూ దారుణంగా మాట్లాడిన ఆడియో, వీడియోలు వెలుగులోకి రావడం సంచలనంగా మారింది. మొత్తం వ్యవహారంపై బాధితురాలు తిరుపతి ఎస్పీ కార్యాలయంలో ఫిర్యాదు చేసింది.

సస్పెన్షన్‌కు రంగం సిద్ధం!

సనాతన ధర్మ పరిరక్షణకు పాటుబడతానని, మహిళలకు రక్షణ కవచంలా ఉంటానని జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ తరచూ ప్రకటిస్తున్నారు. ఈ క్రమంలో పవిత్ర పుణ్యక్షేత్రమైన తిరుపతికి జనసేన ఇన్‌చార్జిగా వ్యవహరిస్తున్న కిరణ్ రాయల్ వికృత పోకడలపై వీడియో, ఆడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. మహిళను చంపేస్తానంటూ బెదిరించిన కిరణ్ రాయల్‌ను పార్టీ నుంచి నేడో, రేపో సస్పెన్షన్ వేటు వేసే అవకాశం ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. అయితే ఆధారాలు వెలుగు చూసినా పార్టీ అధిష్టానం రెండు రోజులుగా స్పందించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఆ పార్టీకి చెందిన ముఖ్యనేతలు సైతం కిరణ్‌రాయల్ అక్రమాలపై కచ్చితమైన ఆధారాలతో పవన్ కల్యాణ్‌కు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. దీనిపై స్పందించిన పవన్ కల్యాణ్ విచారణకు ఆదేశించారు. తదుపరి నిర్ణయం ప్రకటించేవరకు పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉండాలని కిరణ్ రాయల్‌కు స్పష్టం చేశారు.



చినబాబుతో చిల్లర కిరణ్

ప్రభుత్వ భూమి.. దర్జాగా కబ్జా

చౌడేపల్లె: ప్రభుత్వ స్థలంపై కన్ను పడిందా.. వేసేయ్ పాగా... అధికారమే అండగా ఆక్రమణదారులు రెచ్చిపోతున్నారు. రాత్రి , పగలు తేడా లేకుండా జేసీబీలతో రాళ్లను సైతం పెకలించి చదును చేసేస్తున్నారు. వీరికి సెలవు దినాలు వస్తే ఇక అడ్డే ఉండదు.. అక్రమార్కులకు అధికారుల అండదండలు ఉన్నాయనే ఆరోపణలున్నాయి. ఇదంతా ఎక్కడో కాదో.. ఏ.కొత్తకోట పంచాయతీ మంచినీళ్లపల్లెలో ఆదివారం చోటు చేసుకుంది. ప్రధాన రోడ్డుకు గల ప్రభుత్వ స్థలంపై ఆ గ్రామానికి చెందిన కొందరి కన్నుపడింది. ఎలాగైనా సరే ఆ స్థలాన్ని ఆక్రమించుకొని తన స్వాధీనంలోకి తీసుకోవాలని కుట్రలు పన్నారు. రూ.లక్షలు విలువ చేసే స్థలంలోని రాళ్లను నిబంధనలకు విరుద్ధంగా రిగ్గుబండి పెట్టి పేల్చి జేసీబీల సాయంతో రాళ్లను బయటకు తరలిస్తుండగా గ్రామస్తులు అడ్డుకొనే ప్రయత్నం చేయబోయారు. ఈ ఆక్రమణలపై అధికారులకు ఫిర్యాదు చేయడానికి ఫోన్ చేస్తే స్పందించలేదని గ్రామస్తులు ఆరోపించారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రభుత్వ స్థలంను ఆక్రమణదారుల నుంచి రక్షించాలని గ్రామస్తులు కోరుతున్నారు.



మంచినీళ్లపల్లెలో ప్రభుత్వ భూమిని ఆక్రమించి జేసీబీతో రాళ్లు తొలగిస్తున్న దృశ్యం

పకడ్బందీగా 'నులి' నివారణ

- నేడు జాతీయ నులిపురుగుల దినోత్సవం
- అన్ని విద్యాసంస్థల్లో అల్బెండజోల్ మాత్రల పంపిణీ
- కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ వెల్లడి

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా సోమవారం జాతీయ నులిపురుగుల దినోత్సవంను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ ఆదేశించారు. ఈ మేరకు ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పిల్లల ఆరోగ్యవృద్ధిని పెంపొందించి ఉన్నత పౌరులుగా ఎదిగేలా చేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. జిల్లాలోని జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని అన్ని అంగన్‌వాడీ, ప్రభు త్వ , ప్రైవేటు విద్యా సంస్థలలో నిర్వహించి అల్బెండ జోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. పిల్లల కడుపులోని కొంకి పురుగులు, నులి పురుగులు బద్దె పురుగులు, గుండ్రని పురుగులు నివారించడం వల్ల పిల్లల ఆరోగ్యవృద్ధి పెంపొందుతుందన్నారు. 1 నుంచి 19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. కార్యక్రమం నిర్వహణపై అన్ని శాఖల అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చామన్నారు. జిల్లాలోని 2,420 అంగన్‌వాడీ కేంద్రాల్లో 76,924 మంది, 2,883 ప్రభుత్వ, ప్రైవేట్ ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాల్లో 2,36,691, 163 ప్రభుత్వ, ప్రైవేటు ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్, ఐటీఐ నర్సింగ్ కళాశాలల్లో 43,787 మంది, బడిబయట పిల్లలు 4486 మొత్తం 3,63,888 మంది విద్యార్థులకు మాత్రలు పంపిణీ చేస్తారన్నారు. ఈ కార్యక్రమాన్ని విద్యాశాఖ, వైద్య శాఖ, ఐసీడీఎస్, ఎంపీడీఓలు, మున్సిపల్ కమిషనర్లు, సంక్షేమశాఖల అధికారులు పాల్గొని సమన్వయంతో వందశాతం పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్‌కుమార్ గాంధీ

నిఘా నిద్రపోతోంది..!

- కుప్పాన్ని వణికిస్తున్న దొంగతనాలు
- పట్టపగలు ఇళ్లలో చోరీలు
- హడలిపోతున్న జనం

కుప్పం : రాత్రి, పగలు తేడా లేకుండా కుప్పం పట్టణంలో దొంగలు బరితెగిస్తున్నారు. నిలిపి ఉన్న వాహనాలు నుంచి నివాస గృహాల్లో ఎవరూ లేని సమయం చేసి చొరబడటమే కాకుండా... పట్ట పగలు రోడ్డుపై వెళ్లే మహిళల మెడల్లో చైన్లు సైతం లాక్కొని వెళుతూ ప్రజలను భయాందోళనకు గురి చేస్తున్నారు. వారం రోజులుగా చైన్ స్నాచింగ్, చోరీలు అధికం కావడంతో పట్టణం ఉలిక్కి పడుతోంది. పోలీసు నిఘా లోపించడంతో పాటు సీసీ కెమెరాలు అవసరమైన సంఖ్యలో లేకపోవడం దొంగలకు వరంగా మారుతోంది. నిఘా పెంచాల్సిన పోలీసులు నామమాత్రపు చర్యలే తప్ప దొంగతనాలు అరికట్టేందుకు పటిష్ఠ చర్యలు తీసుకోవడంలో విఫలం అయ్యారనే విమర్శలు సర్వత్రా వ్యక్తం అవుతున్నాయి.

కుప్పం పట్టణంలో వారం రోజల వ్యవధిలో పట్ట పగలే చోరీలు అధికం అయింది. ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లో ఓ టీచర్ ఇంటిలో వారం రోజుల కిందట దొంగలు పడ్డారు. భార్యాభర్తలు ఉద్యోగస్తులు కావడంతో ఉదయం డ్యూటీలకు వెళ్లారు. గమనించిన దొంగలు ఇళ్లలోకి చొరబడ్డారు. 30 గ్రాముల బంగారు, లక్షలు రూపాయిల నగదు తస్కరించుకుని పోయారు. అదేవిధంగా హెచ్‌పీ రోడ్డులో ఓ ఇంటిలో మధ్యాహ్నం సమయంలో దొంగలు చొరబడి వెండి సామగ్రి, బంగారు నగలు సుమారు రూ.2 లక్షలు విలువ చేసే సామగ్రి చోరీకి పాల్పడ్డారు. అదే విధంగా ఉదయం పాఠశాలలో పిల్లలను వదిలేందుకు రోడ్డులోకి వచ్చిన ఓ వృద్ధురాలి మెడలోని 40 గ్రాముల బంగారు చైనును పట్ట పగలే లాక్కెళ్లారు. అదే విధంగా విజయలక్ష్మి రోడ్డులో మంగళవారం ఉదయం మరో మహిళ మనువడిని స్కూల్‌కు వదిలేందుకు వెళ్తుండగా గుర్తు తెలియని వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. నిత్యం చోరీలు అధికమవుతుండటంతో ప్రజలు భయాందోళన చెందుతున్నారు. దీంతో పాటు ద్విచక్ర వాహనాలు సైతం భారీగా చోరీకి గురయ్యాయి. వారం రోజులుగా 8 వాహనాలు దొంగతనానికి గురికావడంతో పోలీసులు పట్టుకున్న విషయం తెలిసిందే. దీనిపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాల్సి ఉంది.



పట్టపగలు ప్యాలెస్ ఎక్స్‌టెన్షన్‌లోని ఓ టీచర్ ఇంట్లో జరిగిన చోరీ(ఫైల్)

కొరవడిన నిఘా...

కుప్పం మున్సిపాలిటీ పరిధిలో పోలీసు నిఘా కొరవడిందని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో నిఘా పెంచేందుకు ప్రత్యేకంగా పెట్రోలింగ్ ద్వారా రెండు ద్విచక్ర వాహనాలతో పట్టణ పురవీధుల్లో గస్తీ చేపట్టేవారు. దీంతో పాటు అదనంగా రాత్రి వేళల్లో ప్రత్యేక నిఘా బృందం వాహనాలతో నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో పర్యటించేవారు. ప్రస్తుతం ఇలాంటి పెట్రోలింగ్ కానరావడం లేదు. నేతాజీ రోడ్డులోని పోలీసు స్టేషన్ నుంచి రైల్వేగేటు వరకు ఉదయం, సాయంత్రం పాఠశాలలు, కళాశాలలకు వెళ్లేందుకు రద్దీగా ఉండటంతో ట్రాఫిక్ సైతం నివారించలేకపోతున్నారు. పూర్తిగా నిఘా విభాగం విఫలం కావడంతో చోరీలు అధికమవుతున్నాయి. ప్రస్తుతం ముఖ్యమంత్రి నియోజకవర్గం కావడంతో పూర్తి స్థాయిలో అన్ని పోలీసు స్టేషన్‌లో సిబ్బందిని నియమించారు. దీంతో పాటు ప్రత్యేకంగా 20 మంది పోలీసు బలగాలను గుడుపల్లె రోడ్డులోని వన్యకుల క్షత్రియ భవనంలో ఏర్పాటు చేశారు. కానీ పోలీసు బలగాలు నియోజకవర్గంలో పెరిగినా నిఘా మాత్రం కొరవడిందని స్థానికులు అంటున్నారు.

11న కాణిపాకం ఆలయ హుండీ లెక్కింపు

కాణిపాకం : కాణిపాకంలోని శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఆలయ ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. ఆస్థాన మండపంలో ఉదయం 7 గంటలకు లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. ఆలయాధికారులు, సిబ్బంది విధిగా లెక్కింపులో పాల్గొనాలని పేర్కొన్నారు.

నేడు మద్యం దుకాణాల కేటాయింపు

చిత్తూరు అర్బన్ : కల్లుగీత సామాజిక వర్గాలకు కేటాయించిన మద్యం దుకాణాలకు లైసెన్సులు జారీ చేసే ప్రక్రియ సోమవారం జరగనుంది. చిత్తూరులోని కలెక్టరేట్ భవనంలో డీఆర్‌డీఏ సమావేశ మందిరంలో ఉదయం 9 గంటలకు కలెక్టర్ సమక్షంలో లాటరీ పద్ధతిన దుకాణాల కేటాయింపు చేస్తారు. జిల్లాలో 10 మద్యం దుకాణాలకు గీత సామాజిక వర్గాలకు కేటాయిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం తెలిసిందే. కాగా ఇందులో పెద్దపంజాణి ఎక్సైజ్ అండ్ అర్బన్ స్టేషన్ పరిధిలో ఒక దుకాణానికి ఒకే దరఖాస్తు పడటంతో దీనికి లాటరీ వేయరు. ఇక చిత్తూరు కార్పొరేషన్ పరిధిలో ఒక దుకాణానికి 13 దరఖాస్తులు, నగరిలో 11 దరఖాస్తులు, పలమనేరులో 5, పుంగనూరులో 8, చిత్తూరు రూరల్ మండలంలో 14, గుడుపల్లెలో 16, పాలసముద్రంలో 6, వి.కోటలో 2, వెదురుకుప్పంలో 3 చొప్పున దరఖాస్తులు రాగా వీటికి లాటరీ తీసి దుకాణాలు కేటాంచనున్నారు. 79 దరఖాస్తుల ద్వారా.. ఒక్కో దరఖాస్తుకు రూ.2 లక్షల నాన్–రీఫండబుల్ రుసుం కింద ప్రభుత్వానికి రూ.1.58 కోట్ల ఆదాయం సమకూరినట్లయింది.

ప్రయోగాలకు వేళాయె!

– నేటి నుంచి నాన్ జంబ్లింగ్‌లో ఇంటర్ ప్రాక్టికల్స్

చిత్తూరు కలెక్టరేట్ : జిల్లా వ్యాప్తంగా ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం సైన్సు గ్రూపు విద్యార్థులకు ఈ సోమవారం నుంచి 20వ తేదీ వరకు నాన్ జంబ్లింగ్ పద్ధతిలో (చదువుతున్న కళాశాలలోనే) ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఈ మేరకు ప్రయోగ పరీక్షల నిర్వహణపై జిల్లా ఇంటర్మీడియట్ డీవీఈఓ సయ్యద్ మౌలా పలు వివరాలు వెల్లడించారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. జిల్లాలో మొత్తం 28 కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు జరుగుతాయన్నారు. ఈ ప్రయోగ పరీక్షలకు 7,800 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ పరీక్షలకు ప్రతి కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు.



సయ్యద్‌మౌలా, డీవీఈఓ

నేటి నుంచే మొదటి విడత

జిల్లా వ్యాప్తంగా మొదటి విడతగా 28 పరీక్ష కేంద్రాల్లో ప్రయోగ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు, మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్షలు నిర్వహించడం జరుగుతుందన్నారు.

వాట్సాప్ ద్వారా హాల్‌టికెట్లు

విద్యార్థులు ఫీజులు చెల్లించకపోతే ప్రైవేట్ కళాశాలలు విద్యార్థులకు హాల్‌టికెట్లు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తున్నట్లు ఫిర్యాదులు అందేవని చెప్పారు. ఇలాంటి సమస్యలు తలెత్తకుండా ఇంటర్మీడియట్ అధికారులు వాట్సాప్ విధానంలో హాల్‌టికెట్‌లు జారీచేయాలని మన మిత్ర అనే విధానంను అమల్లోకి తీసుకొచ్చారన్నారు. వాట్సాప్ నంబర్ 95523 00009ను అందుబాటులోకి తీసుకొచ్చిందన్నారు. ఈ పద్ధతిలో పరీక్ష ఫీజు చెల్లించిన ప్రతి విద్యార్థి హాల్‌టికెట్‌ను డౌన్ లోడ్ చేసుకోవచ్చన్నారు. హాజరుతో సంబంధం లేకుండా, హాల్‌టికెట్ పై సంబంధిత కళాశాల ప్రిన్సిపల్ సంతకం లేకపోయినా పరీక్షకు హాజరుకావచ్చని డీవీఈఓ వెల్లడించారు.

క్లుప్తంగా

కిక్కిరిసిన బోయకొండ

- రద్దీగా క్యూలైన్‌లు
- మొక్కులు చెల్లించుకున్న భక్తులు



అలంకరణలో అమ్మవారు

చౌడేపల్లె : ప్రముఖ పుణ్యక్షేత్రంగా విరాజిల్లుతున్న బోయకొండ గంగమ్మ ఆలయం భక్తులతో ఆదివారం కిటకిటలాడింది. కోరిన కోర్కెలు తీర్చే గంగ మ్మ ఆశీర్వదించమ్మా అంటూ పూజలు చేశారు. ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల నుంచి వేల మంది భక్తులు అమ్మవారి దర్శనం కోసం వాహనాల్లో తరలివచ్చారు. అర్చకులు అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. మాఘమాసం సందర్భంగా మహిళలు ఉపవాస దీక్షలతో ఆలయం వద్దకు చేరుకొని గంగమ్మకు పూజలు చేశారు. వర్షాలు సకాలంలో కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారికి పూజలు చేసి మొక్కు లు చెల్లించారు. చిరు జల్లులను సైతం భక్తులు లెక్క చేయకుండా దర్శన కోసం భక్తులు తరలిరావడంతో క్యూలైన్లు భక్తులతో కిక్కిరిసిపోయాయి. కోరిన కోర్కెలు తీరిన భక్తులు పిండి, నూనె దీపాలు, దీవెలతో మేళ తాళాల నడుమ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. ఆలయ ఈఓ ఏకాంబరం ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఉచిత ప్రసాదాలను పంపిణీ చేశారు. పోలీసులు ఎలాంటి సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

చౌడేపల్లె : మండలంలోని బోయకొండ మార్గంలోని ఊటూరు బస్‌స్టాప్ వద్ద మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ నాగేశ్వర రావు తెలిపారు. ఊటూరుకు చెందిన చంద్ర బాబు బస్‌స్టాప్ వద్ద మద్యం విక్రయిస్తుండగా సమాచారం మేరకు అదుపులోకి తీసుకున్నట్లు చెప్పారు. అతని వద్ద గల 12 క్వార్టర్ బాటిళ్ల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.ఈ మేరకు అతడిని అరెస్ట్ చేసి న్యాయమూర్తి ఎదుట హాజరు పర్చగా రిమాండుకు ఆదేశించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులకు ప్రజలు సమాచారం ఇవ్వాలని కోరారు.

104కు జ్వరం

పల్లెల్లో 104 సంచార వైద్య సేవలకు జ్వరం పట్టుకుంది. దీంతో పల్లెసేవలు పడకేశాయి. జ్వరం వస్తే కనీసం పారాసెటమాల్ మాత్రలు అందుబాటులో లేవు. జలుబు చేసినా.. జ్వరం వచ్చినా పల్లె జనం ప్రైవేటు ఆసుపత్రులకు పరుగులు పెట్టాల్సిన దుస్థితికి కూటమి ప్రభుత్వం తీసుకొచ్చింది. ఈ సేవలను గత ప్రభుత్వం కంటే మెరుగ్గా అందించాల్సిన కూటమి ప్రభుత్వం నేడు 104 సేవల నిర్వీర్యానికే మొగ్గు చూపుతున్న నిర్లక్ష్య ధోరణి ప్రదర్శిస్తుండడంతో పల్లె జనాన్ని కలవరానికి గురిచేస్తోంది.

- 104 వైద్యసేవల నిర్వీర్యానికి కుట్ర
- వేధిస్తున్న మందుల కొరత
- పల్లెల్లో ఆరోగ్య సేవలు అంతంతే..
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం



చిత్తూరు రూరల్ (కాణిపాకం) : పల్లెలో 104 సంచార వైద్యం కదలనంటోంది. కూటమి రాకతో సేవలు మొక్కుబడిగా మారాయి. 104పై ప్రభుత్వం చిన్నచూపు చూస్తోంది. ఈ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు కుట్ర పన్నుతోంది. ఈ కారణంగా ఆ వాహనాలు గ్రామాలకు చుట్టపు చూపుగా వెళుతున్నాయి. ప్రధానంగా మందులు, మాత్రల కొరత వేధిస్తోంది. దీంతో పల్లెలో 104 వైద్య సేవలు నామమాత్రం అయ్యాయి. జిల్లా వ్యాప్తంగా 50 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలున్నాయి. వీటి పరిధిలో 104 వాహనాలు 44 తిరుగుతున్నాయి. ఈ వాహనం ద్వారా ప్రతినెలా 464 శిబిరాలు నిర్వహిస్తున్నారు. ప్రతి క్యాంపునకు ఓ డాక్టర్, డీఈఓ, ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆశా వర్కర్, సూపర్ వైజర్ హాజరువుతున్నారు. చాలా చోట్ల సర్వే సమస్యలతో ఎంఎల్‌హెచ్‌పీలు హాజరు కావడం లేదు. వారికి సర్వేలు, ఇతర సేవలకు సమయం సరిపోతోందని వైద్యాధికారులు చెబుతున్నారు. కాగా వీరి వద్దకు ప్రతినెలా 83 వేలకుపైగా ఓపీలు వస్తున్నాయి. ఇందులో అధికంగా బీపీ, మధుమేహ సమస్యలతో బాధపడుతున్న వారు నిత్యం వచ్చి పరీక్షించుకుంటున్నారు. ప్రతినెలా బీపీ బాధితుల



ఓపీ సంఖ్య 20 వేలు, మధుమేహుల సంఖ్య 17 వేలు దాటుతోంది. దీంతో పాటు వృద్ధులు, గర్భిణులు అధికంగా వస్తున్నారు. సీజనల్ వ్యాధుల సమయంలో జనరల్ ఓపీల సంఖ్య మరింత ఎక్కువగా ఉంటుంది. అయితే ఇందుకు తగ్గట్లు 104లో వైద్య సేవలు కరువవుతున్నాయి.

104 మొబైల్ వైద్యసేవల ఓపీ వివరాలు

నెల	ఓపీ	జనరల్	ఏఎన్‌సీ	పీఎన్‌సీ	బీపీ	మధుమేహం
నవంబర్	7374	8587	2935	20803	17380	24651
డిసెంబర్	6196	8620	2991	20395	16965	24852
జనవరి	4423	5331	2025	14812	11749	16663

కూటమి కుట్ర..

పల్లె వైద్యాన్ని మట్టుపెట్టేందుకు కూటమి ప్రభుత్వం కుట్ర పన్నుతోంది. వైద్య వ్యవస్థను భ్రష్టు పట్టిస్తోంది. ఇందులో భాగంగానే మెడికల్ కాలేజీలను ప్రైవేటు చేతిలో పెట్టేందుకు ప్రయత్నాలు చేసింది. ఇక ఆరోగ్య శ్రీలో వ్యాధుల సంఖ్యను కుదిస్తోంది. ఆరోగ్య శ్రీ ద్వారా పేద ప్రజలకు సేవలు అందకుండా చేస్తోంది. ప్రాథమిక ఆరోగ్యాన్ని కుంటుపడేలా చేస్తోంది. వైద్య సేవలను పట్టించుకోకపోవడంతో జిల్లా, ఏరియా, సీహెచ్‌సీల్లో కూడా వైద్య సేవల్లో నిర్లక్ష్యం అలుముకుంది. సిబ్బంది కొరత వేధిస్తోంది. ఇదే క్రమంలో 104ను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం మందులు, మాత్రలు ఇవ్వకుండా పల్లె వైద్యాన్ని గాలికి వదిలేసింది.

మందు బిళ్లలూ కష్టమే..

104 సంచార వైద్యం తిరుపతి సెంట్రల్ నుంచి మందులు, మాత్రలు సరఫరా అవుతున్నాయి. 104 సేవల్లో 74 రకాల మాత్రలు అందుబాటులో ఉండాలి. ప్రస్తుతం 40 రకాల మాత్రలు కూడా ఉండడం లేదు. ఉన్న ఆ మాత్రలు అరకొరగా ఉన్నాయి. జ్వరం, జలుబు, దగ్గుకు మాత్రలు కనిపించడంలేదు. బీపీ, మధుమేహ మాత్రలు కొరత ఉంది. కొన్ని రకాల సిరఫ్‌లు లేవు. దీంతో 104 వైద్యంలో నిర్లక్ష్యపు జాడ్యం అలుముకుంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 74 రకాల మాత్రలను మూడు నెలలకు ఒకసారి అందించేవారు. కావాల్సినన్ని మందులు, మాత్రలు ఇస్తూ పల్లె జనానికి డోకా లేకుండా చూసుకునేవారు. ఇప్పుడు ఆ పరిస్థితికి భిన్నంగా ఉందని వైద్యులు, సిబ్బంది వాపోతున్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇలా..

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వైద్య సేవలను మరింత విస్తృతం చేసింది. ముఖ్యంగా పల్లె వైద్యానికి పెద్దపీట వేసింది. విలేజ్ హెల్త్ క్లినిక్‌లను తీసుకొచ్చింది. ఫ్యామిలీ డాక్టర్ విధానంతో ఇంటికే డాక్టర్లను రప్పించింది. ఆరోగ్యశ్రీలో పలు రకాల జబ్బులను చేర్చి రూ.25 లక్షల వరకు వైద్య సేవలు అందేలా చేసింది. జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో క్యాంపులను ఏర్పాటు చేసింది. వైద్య సిబ్బంది ఇంటికొచ్చి పరీక్షలు చేసి వైద్య సేవలను అందించేలా చేసింది. 104 ద్వారా సేవలు పక్కాగా అందేలా చేసింది. కావాల్సిన మందులు, మాత్రలు అందించడంతో పాటు పేదల ఆరోగ్యానికి భరోసా కల్పించేది. ఇప్పుడు ఆ రకంగా లేకపోవడంలో పల్లెలోని పేద ప్రజలు వైద్య సేవల కోసం పట్టణాల్లోని ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది.

అందుబాటులో లేని మందులు

డైక్లోఫెనాక్, పారా సెటమల్, బీ కాంప్లెక్స్, పాంటెక్, రేంటాక్, ఐరన్, ఫోలిక్ యాసిడ్, మల్టీ విటమిన్, టెనిలిగ్లిప్టిన్, టెనిఫిట్ మాత్రలు పూర్తి స్థాయిలో లేవని వైద్యులు చెబుతున్నారు. సిరప్‌లో అమ్రోక్స్, అమాక్సిలిన్, సాల్బుటమాల్‌లు లేవని అంటున్నారు. క్రోటోమోజోల్, ముట్రోసిస్ అయిల్‌మెంట్ లేక జనానికి ఇవ్వలేకపోతున్నామని చెబుతున్నారు. దీంతో పాటు విలువైన మాత్రలు కావాలంటే గతంలో పోస్టల్ ద్వారా ఇంటికే పంపేవారు. ఆ రకం మాత్రలకు కూడా ఇప్పుడు చెక్ పడిందని, ఇక గర్భిణులకు ఈసీజీ తీయాలంటే ఈసీజీ మిషన్లు చాలా చోట్ల పనిచేయడం లేదని వాపోతున్నారు. అలాగే హెచ్‌పీ మిషన్లు మొరాయిస్తున్నారని వైద్యులు చెబుతున్నారు.

గతంలో బాగుండేది..



జగన్ ప్రభుత్వంలో ఎప్పుడు చూసినా ఆశా కార్యకర్తలు , ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఇంటి వద్దకు పరుగెత్తుకుని వచ్చేవారు. ఆ పరీక్షలు, ఈ పరీక్షలు చేసేవారు, కాస్త దగ్గిన, తుమ్మిన టక్కుమని ఈ మాత్ర వేసుకోమని చెప్పేవారు. 104 వస్తే బండి వస్తా ఉండాదని పదే పదే చెప్పేవారు. ఇప్పుడు ఆ రకంగా లేదు. పల్లెల్లో ఈ సేవలు బాగా అవసరం. 104పై నిర్లక్ష్యం చేస్తే పల్లె జనానికి జబ్బు చేస్తే నేడు పట్టణానికి పరుగెత్తాల్సిన దుస్థితి వచ్చింది.

– జార్జ్‌కుమార్, గంగాధరనెల్లూరు

మాత్రలు అడిగితే లేవంటున్నారు



దగ్గు, జలుబు అని వెళితే చూసి రెండు బిల్లలు ఇస్తున్నారు. ఇదేమి..ఇంకా రెండు బిల్లులు ఇవ్వచ్చు కదా అని అడిగితే లేదు..తక్కువగా ఉన్నాయి. ఇంకొన్ని మాత్రలు బయట తీసుకోమని చెబుతున్నారు. లేకుంటే పీహెచ్‌సీకి వెళ్లి తీసుకోమని అంటున్నారు. ఇలాగైతే ఎలా. ముందు అన్ని రకాల మాత్రలు ఇచ్చే వాళ్లు. ఇప్పుడు ఆ రకంగా ఇవ్వాలి.

– ఢిల్లీబాబు, గుడిపాల

మందులు లేవా..? తెలుసుకుంటా..



104 వాహనాల ద్వారా అందించే సేవలకు మందులు లేవంటే కనుక్కుంటాను. నా దృష్టికి అయితే మాత్రలు, మందులు లేవనే విషయం రాలేదు. ఆ మందులు ఎక్కడి నుంచి వస్తాయో తెలుసుకుంటా. ఇబ్బంది లేకుండా చూస్తాను. పూర్తి స్థాయిలో తెప్పించే ప్రయత్నం చేస్తా.

– సుధారాణి, డీఎంఅండ్‌హెచ్‌ఓ, చిత్తూరు

పట్టుబడ్డ ఎర్రచందనం?

- చిత్తూరు మండలం దిగువకండ్రిగలో కలకలం
- దుంగలు స్వాధీనం.. కూటమినేత అదుపులో..!
- వదిలేయాలని నేతల ఒత్తిళ్లు



విచారణలో అటవీశాఖ అధికారులు.. గుమికూడిన గ్రామస్తులు

సాక్షి టాస్క్‌ఫోర్స్ : చిత్తూరు మండలంలోని దిగువ కండ్రిగ గ్రామంలో శనివారం రాత్రి ఎర్రచందనం కలకలం రేపింది. 8 దుంగలను అటవీశాఖ అధికారులు పట్టుకున్నారు. దుంగలను స్వాధీనం చేసుకుని.. కూటమి నేతను అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయం తెలియడంతో బడా నేతలు పట్టుబడ్డ వ్యక్తిని వదిలిపెట్టాలని అధికారులపై ఒత్తిడి తెచ్చారు. అటవీశాఖ అధికారుల వివరాల మేరకు...చిత్తూరు మండలం దిగువ కండ్రిగ సమీపంలో ఓ పెద్ద ఫ్యాక్టరీ ఉంది. ఆ ఫ్యాక్టరీ వెనుక ఉన్న ఓ ప్రభుత్వ భూమిలో ఎర్రచందనం చెట్లు ఉన్నాయి. ఆ చెట్లు కొట్టేశారా లేదా...గాలికి పడిపోయిందా అనే విషయం తెలియడం లేదు. ఈ దుంగలను ఓ కూటమి నేత ఇంటికి తెచ్చుకున్నాడు. ఈ దుంగలను అమ్మకానికి వ్యాపారులతో బేరసారాలు చేసినట్లు గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. అయితే ఈ విషయం ఊరంతా పాకింది. దీంతో గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు ఫోన్ చేశారు. సమాచారం అందుకున్న చిత్తూరు ఈస్ట్ అటవీ శాఖ సిబ్బంది రంగంలోకి దిగారు. పూర్తి స్థాయిలో విచారణ చేపట్టారు. ఆ తర్వాత దుంగలను స్వాధీనం చేసుకున్నారు. ఈ విషయం కూటమిలోని బడా నాయకులతో తెలియడంతో పట్టుబడ్డ వ్యక్తిని కాపాడేందుకు విశ్వ ప్రయత్నాలు చేశారు. వెంటనే వదిలిపెట్టాలని హుకుం జారీ చేశారు. అయితే ఈ విషయం బహిర్గతం కావడంతో అటవీ శాఖ అధికారులు కూడా చేసేదీ లేక రెండు గంటల పాటు రెండు పేజీల రిపోర్ట్ రాశారు. ఆ తర్వాత పట్టుబడ్డ వ్యక్తిని అదుపులోకి తీసుకుని దుంగలను వెంట వేసుకుని వెళ్లారు. సోమవారం ఈ దుంగలను డీఎఫ్‌ఓ పరిశీలించనున్నారు. కాగా ఆ వ్యక్తిని వదిలిపెట్టాలని కూటమి నేతల నుంచి అటవీశాఖ అధికారులకు ఒత్తిళ్లు వస్తున్నట్లు సమాచారం.

సీపీఆర్ కొత్త అపార్ట్‌మెంట్‌కు భూమి పూజ



ప్లాట్స్‌కు సంబంధించిన బుక్‌లెట్‌ను ఆవిష్కరిస్తున్న ఆ సంస్థ అధినేత, ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: సీపీఆర్ కన్‌స్ట్రక్షన్ వారి ఆధ్వర్యంలో మంగళం రోడ్డులోని ఎంఆర్‌ఎఫ్ షోరూంకు ఎదురుగా నిర్మించనున్న సీపీఆర్ సరికొత్త 2బీహెచ్‌కే అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ఆదివారం ఘనంగా భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఆర్ సంస్థ ఎండీ చలపతిరెడ్డి మాట్లాడుతూ ప్రత్యేకమైన, ఆధునిక సదుపాయాలతో కూడిన 2బీహెచ్‌కే ప్లాట్లను ప్రవేశ పెడుతున్నట్లు తెలిపారు. ప్రీమియం లొకేషన్, మోడర్న్ డిజైన్ అండ్ ఆర్కిటెక్చర్, 24/7 సెక్యూరిటీ సేఫ్టీ, పార్కింగ్, క్లబ్ హౌస్, పార్క్ వంటి ప్రత్యేక సౌకర్యాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతేకాక పాఠశాలలు, ఆస్పత్రులు, షాపింగ్ మాల్స్ సమీపంలో ఏర్పాటు చేస్తూ అందరికీ అనువైన చోట మీ కలల ఇంటిని నిజం చేసుకునేందుకు కృషి చేస్తున్నట్టు తెలిపారు. ప్రీ బుకింగ్ ప్రారంభమైందని, ప్రారంభ ఆఫర్ ధర రూ.37 లక్షలు మాత్రమేనని పేర్కొన్నారు. పరిమిత సమయం, పరిమిత యూనిట్లకు మాత్రమే ఉంటుందని, మీ ఆస్తి సొంతం చేసుకోవడానికి ఇదే సరైన సమయం అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9492013322, 9492013366లను సంప్రదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఆసంస్థ డైరెక్టర్లు కాశి విశ్వనాథ్, లోకేష్, వినీష్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా : వ్యక్తి మృతి



ట్రాక్టర్ కింద పడి మృతి చెందిన సుబ్బారెడ్డి

గుడుపల్లె : వేగంగా వెళ్తున్న ట్రాక్టర్ మలుపులో అదుపు చేయలేకపోవడంతో బోల్తా పడి సుబ్బారెడ్డి(44) అనే వ్యక్తి ఆదివారం అక్కడిక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు.. కర్ణాటక రాష్ట్ర సరిహద్దులోని కాలువలపల్లె గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి సేంద్రియ ఎరువును తీసుకోపోవడానికి గుడుపల్లె మండలంలోని కుప్పిగానిపల్లె గ్రామానికి ట్రాక్టర్‌లో బయలుదేరాడు. ఉదయం నుంచి పొలం దున్ని మ , ధ్యాహ్న సమయంలో ట్రాక్టర్‌ను తీసుకుని వస్తుండగా పొగురుపల్లె సమీపంలోని బస్టాండ్ మలుపు వద్ద ట్రాక్టర్‌ను అదుపుచేయలేక బోల్తా పడింది. సుబ్బారెడ్డి ట్రాక్టర్ కిందపడి మృతి చెందాడు. వెంటనే అక్కడున్న స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని జేసీబీతో బోల్తా పడిన ట్రాక్టర్‌ను బయటకు తీసి కింద పడి ఉన్న సుబ్బారెడ్డి శవాన్ని బయటకు తీశారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కుంకీ ఏనుగులతో సమస్య పరిష్కారం



కుంకీ ఎలిఫెంట్ క్యాంపు పనులను పరిశీలిస్తున్న చిరంజీవి చౌదరి

- కుంకీ ఎలిఫెంట్ శిబిరం పరిశీలన

పలమనేరు : జిల్లాలోని పలమనేరు కౌండిన్య అభయారణ్యం నుంచి రైతుల పంట పొలాల్లోకి వస్తున్న ఏనుగులను కట్టడి చేసేందుకు ప్రభుత్వం ఇక్కడ కుంకీ ఎలిఫెంట్ క్యాంపును ఏర్పాటు చేస్తోందని, దీని ద్వారా ఏనుగుల సమస్యకు పరిష్కారం దొరుకుతుందని అటవీశాఖ ప్రిన్సిపల్ చీఫ్ కన్జర్వేటర్ చిరంజీవి చౌదరి పేర్కొన్నారు. మండలంలోని ముసలిమొడుగు వద్ద చేపడుతున్న కుంకీ ఎలిఫెంట్ ప్రాజెక్టును ఆదివారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పలమనేరు, కుప్పం పరిధిల్లోని కౌండిన్య అభయారణ్యం 250 కి.మీ మేర మన రాష్ట్రంతో పాటు తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లోని అడవులకు ఆనుకొని ఉందన్నారు. కౌండిన్య అభయారణ్యంలో స్థిరంగా ఉన్న గుంపులు, మైగ్రేటెడ్ గుంపులు కలిపి సంచరించే ఏనుగులు 120 దాకా ఉన్నాయన్నారు. ఇవి అడవిని దాటి వెళ్లకుండా గతంలో సోలార్ ఫెన్సింగ్, ఎలిఫెంట్ ట్రెంచ్‌లను సైతం ఏర్పాటు చేశామన్నారు. కానీ సమస్య తీరనందున ఇప్పుడు కర్ణాటక రాష్ట్ర సహకారంతో కుంకీ ఏనుగుల ద్వారా ఇక్కడి మదపు టేనుగులను అదుపు చేసే కార్యక్రమాన్ని చేపడుతున్నట్లు తెలిపారు. కర్ణాటక రాష్ట్రంతో ఎంఓయూ చేసుకొని అక్కడ శిక్షణ పొందిన నాలుగు కుంకీ ఏనుగులను ఇక్కడికి త్వరలో తెప్పిస్తామన్నారు. ఇందు కోసం రేంజ్ పరిధిలోని 20 మందికి శిక్షణ ఇప్పించామన్నారు. రూ.12 లక్షల వ్యయంతో కుంకీ ఎలిఫెంట్ క్యాంపును 50 ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఏనుగుల కోసం కర్రల కంచెతో విడిది, మేతను సిద్ధం చేసుకొనే గదులు, చిన్నపాటి చెరువు, శిక్షణస్థలం, క్రాల్స్(మదపు టేనుగులను మచ్చిక చేసుకొనే చెక్క గది) తదితర పనులను ఆయన పరిశీలించారు. మరోవైపు ఇక్కడి అటవీశాఖ భవనాల అభివృద్ధికి త్వరలో నిధులు విడుదల చేస్తామన్నారు. కార్యక్రమాల్లో తిరుపతి కన్జర్వేటర్ సెల్వం , డీఎఫ్‌ఓ భరణి, సబ్ డీఎఫ్‌ఓ వేణుగోపాల్, స్థానిక ఎఫ్‌ఆర్వో నారాయణ, ఎఫ్‌ఎస్వోలు సుకుమార్, సురేంద్ర, రమేష్ పాల్గొన్నారు.

ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

ఇక్కడికి వచ్చిన పీసీసీఎఫ్‌కు రైతు సంఘం నాయకుడు ఉమాపతి నాయుడు ఓ వినతిపత్రాన్ని అందించారు. జిల్లాలో ఏనుగుల దాడుల కారణంగా పంటలకు నష్టంతో పాటు రైతుల ప్రాణాలు పోతున్నాయని విన్నవించారు. ఏనుగుల సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని కోరారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

బంగారుపాళెం : మండలంలోని మొగిలిగొని చెరువులో గల్లంతైన ఫ్యాక్టరీ కార్మికుడు సెల్వకుమార్ మృతదేహాన్ని ఆదివారం చెరువులో నుంచి బయటకు తీసినట్లు పోలీసులు తెలిపారు. తమిళనాడులోని నామకల్‌కు చెందిన వరదరాజన్, లక్ష్మి కుమారుడు సెల్వకుమార్(27) మొగిలిలో ఓ ఫ్యాక్టరీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈనెల 7వ తేదీ సెల్వకుమార్ అతని మిత్రులు గోపి, శరవణ, ప్రశాంత్‌తో కలసి గొనిచెరువులో ఈతకు వెళ్లారు. అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లు, పోలీసులు చెరువులో గల్లంతైన సెల్వకుమార్ కోసం రెండు రోజులుగా గాలింపు చర్యలు చేపట్టినప్పటికీ ఫలితం లేకపోయిందన్నారు. మూడో రోజు శ్రమించి సెల్వకుమార్ మృతదేహాన్ని బయటకు తీసినట్లు వెల్లడించారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం బంగారుపాళెం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామన్నారు. మృతుడి తల్లి లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ శ్రీనివాసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గుర్తు తెలియని వ్యక్తి బలవన్మరణం

సదుం : గుర్తు తెలియని వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. ఎస్‌ఐ షేక్ షావలి కథనం మేరకు..మండల సరిహద్దులోని అంకాళమ్మ కొండ సమీపంలోని అటవీ ప్రాంతంలో 45 ఏళ్లున్న గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకుని ఉండగా ఆదివారం సాయంత్రం పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేశారు. కాగా ఆత్మహత్య చేసుకుని వారం రోజులకు పైబడి ఉంటుందని వారు తెలిపారు. మృతుడి వివరాల కోసం దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

బావిలో పడి వ్యక్తి మృతి

యాదమరి(కాణిపాకం) : ప్రమాదవశాత్తు బావిలో పడి ఓ వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదివారం యాదమరి మండలంలోని కె.కొత్తూరు గ్రామంలో చోటు చేసుకుంది. కొత్తూరు గ్రామానికి చెందిన సురేష్ పని నిమిత్తం బావి దగ్గరకు వెళ్లాడు. అలా వెళ్లిన ఆ వ్యక్తి అదుపు తప్పి బావిలో పడిపోయాడు. విషయం తెలిసిన గ్రామస్తులు మృతదేహాన్ని బావిలో నుంచి వెలికితీశారు. మృతుడి తమ్ముడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

పెళ్లింట తీవ్ర విషాదం

మూడు రోజుల కిందట ఆ ఇంట వైభవంగా పెళ్లి సంబరాలు జరుపుకున్నారు. విందు కోసం వరుడు, వధువుతో పాటు దగ్గరి బంధువులతో కలసి అగరమంగళం నుంచి శనివారం ఆనందంగా రాత్రి ఆటోలో వెళుతుండగా విషాదం చోటు చేసుకుంది. వరుడు, వధువుతో కలిసి వెళుతున్న ఆటోను మృత్యువు రూపంలో వచ్చిన లారీ ఢీకొనడంతో ప్రమాదంలో వధువు చిన్నాన్న మృతి చెందడంతో ఆ ఇంట విషాదఛాయలు అలుముకున్నాయి. వివరాల్లోకి వెళితే..

- విందుకు వెళుతున్న ఆటోను ఢీకొన్న లారీ
- వధువు చిన్నాన్న మృత్యువాత
- మరో ఏడుగురు బంధువులకు గాయాలు



పెరియస్వామి (ఫైల్)

గంగాధర నెల్లూరు : వరుడు రామన్ స్వగ్రామం యాదమరి మండలం గుట్టపై దళితవాడకు ఆదివారం విందు కోసం శనివారం రాత్రి వధువు, వరుడుతో పాటు బంధువులతో కలసి 13 మంది షేర్ ఆటోలో అగరమంగళం నుంచి ప్రయాణిస్తున్న సమయంలో వేల్కూరు సమీపంలోకి రాగానే బ్రిడ్జి వద్ద పుత్తూరు వైపు వెళుతున్న లారీ మృత్యువులా ఆటోపైకి దూసుకురావడంతో ఏడుగురు బంధువులకు తీవ్ర గాయాలయ్యాయి. అయితే వధువు చిన్నాన్న పెరియస్వామి(46) తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే ఈ ఘటనలో వరుడు, వధువు స్వల్ప గాయాలతో బయటపడ్డారు.

నాన్నా మాకెవరు దిక్కు

వరుడి ఇంట జరిగే విందు కోసం వెళుతూ జరిగిన ప్రమాదంలో మృతి చెందిన పెరియస్వామికి భార్యతో పాటు నలుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. శనివారం సాయంత్రం వరకు భార్య పిల్లలతో కలసి సంతోషంగా గడిపిన తండ్రి విగత జీవిగా ఇంటికి చేరిన తండ్రి మృతదేహాన్ని చూసి పిల్లలు నాన్నా ఇక మాకెవరు దిక్కని బోరున విలపించడం చూసి స్థానికులు , బంధువులు కంటతడి పెట్టారు.



రోదిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

ఆనందం ఎంతో సేపు నిలవ లేదు..

అన్న కుమార్తె వివాహానికి అన్ని తానై వివాహాన్ని జరిపించి అందరూ సంతోషంగా విందు కోసం అల్లుడి ఇంటికి వెళ్లే సమయంలో చోటు చేసుకున్న ప్రమాదంలో పెరియస్వామి మృతి చెందడంతో పెళ్లింట బంధు, మిత్రుల రోదనలు మిన్నంటాయి.